శిల్పారామంలో నేడు పంచాంగ శ్రవణం

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం గంటలకు ప్రముఖ కవి, జ్యోతిష్కులు, ఓయూ తెలుగు శాఖ ఆచార్యులు సాగి కమలాకర శర్మ పంచాంగ శ్రవణం చేస్తారు. అనంతరం శ్రీదత్త నాట్యాలయ గురువు రష్మి సచిదానందా శిష్య బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో ఉగాది పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్‌రావు పేర్కొన్నారు.

ఆలయాలు, మసీదుల వద్ద వసతులు కల్పించాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ వి. మమత, అధికారులు

కూకట్‌పల్లి: రంజాన్, శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని మసీదులు, ఆలయాల వద్ద వసతులు కల్పించడంతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రంజాన్ మాసం మొదలవడంతో పాటు హిందువులకు ప్రధానమైన శ్రీరామ నవమి పండగ కూడా ఉండటంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో మసీదులు, ఆలయాల వద్ద పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ సమస్యలు వంటివి సత్వరం పరిష్కరించాలని సూచించారు.

◆ అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మసీదులు, ఆలయాల కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. హైదరాబాద్ మహానగరం అన్ని మతాలు, కులాలు, సాంప్రదాయాలు, సంస్కృతులకు సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలందరూ సోదరభావంతో కలిసి మెలసి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉగాది పండుగను పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలందరి శుభకాంక్షలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మమత, ఏసీపీలు చంద్రశేఖర్, గంగారాం, జలమండలి అధికారి వెంకటేశ్వర్లు, ఉపకమిషనర్లు రవికుమార్, రవీందర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షించడం మన బాధ్యత

అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట్: హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ సహకారంతో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ వాటర్ డే సందర్భంగా వివేక్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన జల సంరక్షణ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు విచ్చేసి నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. మహిళలు వేసే మొదటి అడుగు, కుటుంబం మొత్తంలో గొప్ప మార్పు సాధ్యమని ఆమె తెలిపారు. మనం చేసే పొదుపు రానున్న తరానికి నీటి కొరత లేకుండా చేస్తుందన్నారు. నీటి వనరులను సంరక్షించడం మన బాధ్యత అని ఆమె గుర్తు చేశారు. ఒకప్పుడు నీటి కోసం ఎన్నో అగచాట్లు పడ్డామని, కరువు రాజ్యంగా నిలిచిన తెలంగాణకు నీటి వనరులను అందించిన సస్యశ్యామలం చేసిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్, మహిళా నాయకులు శోభ, సావిత్రి, లలిత, వాటర్ ఎయిడ్ ఇండియా కోఆర్డినేటర ఎంఎస్‌బీ రాజు, ఫెసిలిటేటర్ వాహిద్ అలీ, జ్యోతి, సాయి కిరణ్, గౌసియా, మహిళలు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

ఎమ్మెల్యే కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిటీ సభ్యులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పాండుగౌడ్, బోర్డు సభ్యులుగా ప్రభాకర్‌గౌడ్, టి.యుగేందర్‌సింగ్, ట్రెజరర్లుగా సీహెచ్ కృష్ణంరాజు, రామాంజన్‌రెడ్డి రాము, ఆనంద్‌గౌడ్, వరుణ్, అడ్వయిజర్ మాజీ కార్పొరేటర్ బాబూరావు, నూతన ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి. హేమాద్రిరావు, వి. అనిల్‌కుమార్, శ్రావణ్‌కుమార్, వీవీ హనుమాన్, పి.శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణా పోలాకి, జి.రవిగౌడ్, ఎం.నాగేశ్వరరావు, సీహెచ్. శ్రీనివాస్, వెంకట్ రవి, నితిన్, రవి, వై.ప్రభాకర్, బి.రఘు, కె.రమణీసుధీర్, వై.నాగేందర్‌గౌడ్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, సీనియర్ సిటిజన్ కమిటీ మెంబర్లుగా వై.నారాయణరావు, రమణమూర్తి, ఎస్. తారకనాథ్, ఎస్.హరికృష్ణ ఎన్నికయ్యారు. వీరు మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

పరీక్ష ప్యాడ్‌ల అందజేత

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో చేవెళ్ల ఎంపీ డా.రంజిత్‌రెడ్డి సహకారంతో పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి పరీక్ష ప్యాడ్‌లను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందించిన చేవెళ్ల ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్‌చంద్ర, శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్, అధ్యాపక బృందం, కె.రాధా పద్మజ, అనురాధ, గోవింద్, రామలక్ష్మి, కె. మోహన్‌రావు, కె.అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో పంచాంగ శ్రవణం

మోతీనగర్: మోతీనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది మహోత్సవాన్ని బుధవారం సాయంత్రం 5గంటలకు మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంసీహెచ్‌ఎస్ అధ్యక్షుడు అంజిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ వేద పండితులు విష్ణుభట్ల లక్ష్మీనరసింహ పంచాంగ శ్రవణం సాయంత్రం 7గంటలకు తెలుగు పద్య పఠనం, 8.30 గంటలకు విశిష్ట వ్యక్తులకు సన్మానం ఉంటుందన్నారు. అనంతరం లలిత ధనలక్ష్మి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖ ఆధ్వర్యంలో..

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని మండపం వద్ద నిర్వహించనున్నట్లు నగర కార్యవాహ బోయిన శంకర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైద్యులు ఎస్‌కే జస్వాల్, విద్యాభారతి ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాస్ విచ్చేయుచున్నట్లు తెలిపారు.

తోట రెసిడెంట్స్ ఆధ్వర్యంలో..

అవంతినగర్ తోట రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ ఉమామహేశ్వర సమేత శ్రీసాయిబాబా దేవాలయంలో బుధవారం చైత్ర మాసం తెలుగు నూతన సంవత్సరం పురస్కరించుకొని పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలకు విఘ్నేశ్వర అభిషేకం, అర్చనలు, సాయంత్రం 6.30 గంటలకు ధ్యాన మందిరంలో పంచాంగ శ్రవణం, హారతి, తీర్థప్రసాదాల కార్యక్రమం ఉంటుందన్నారు.

శ్రీశృంగేరి శారద శంకర మఠంలో..

శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు మస్తాన్ బృందం నాదస్వరం, 5.15 గంటలకు బ్రహ్మశ్రీ శివరామకృష్ణ శర్మ పంచాంగ శ్రవణం, 6 గంటలకు బ్రహ్మశ్రీ గుళ్ళపల్లి సోమయాజులుతో వేద స్వస్తి వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

జీ-20 యూనివర్సిటీ కనెక్ట్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ మార్గదర్శకత్వంలో యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు జీ–20 లోగోను అందంగా తీర్చిదిద్దారు. ఈ లోగోను తిలకించిన వీసీ సయ్యద్ ఐనుల్ వారిని అభినందించారు.

ఇంటి వద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాలు

టీఎస్‌ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

రాయదుర్గం: టీఎస్‌ఆర్టీసీ కార్గో ద్వారా భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి కల్యాణ తలంబ్రాలను ఇంటికే తీసుకొచ్చి ఇచ్చే సేవా కార్యక్రమాన్ని ప్రారంభినట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. భద్రాచలం వెళ్లి సీతారాముల కల్యాణం చూడలేని భక్తులు కేవలం రూ.116తో టీఎస్‌ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకుంటే ఈనెల 30న స్వామివారి కల్యాణం అనంతరం తలంబ్రాలను పార్సిల్ రూపంలో 10నుంచి 15 రోజుల్లో అందజేస్తామన్నారు. ఆర్టీసీ అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుకింగ్ కోసం కార్గో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివరాలకు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డి ఫోన్‌నం.9849567204, 9652267204లో సంప్రదించాలని కోరారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు

ఉగాది వేడుకల్లో పంచశీల స్కూల్ విద్యార్థులు

శ్రీసాయి విద్యానికేతన్‌లో విద్యార్థినులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో మంగళవారం ఉగాది పండుగను నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేసి, పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు విద్యార్థులకు తెలిపారు. పండుగలో సంప్రదాయంతో పాటు ఆరోగ్యం, జీవన విధానం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసాయి విద్యానికేతన్‌లో..

మూసాపేట ప్రగతినగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్‌లో మంగళవారం ఉగాది పండుగ నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉగాది పచ్చడి తయారు చేశారు. షడ్రుచులు ఎలా ఉంటాయో మన జీవితంలో కూడా మంచి చెడూ అంటూ ఉంటాయని పాఠశాల కరస్పాండెంట గార్లపాటి సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఎరా పాఠశాలలో..

ఆల్విన్‌కాలనీ: శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం వివేకానందనగర్‌లోని న్యూ ఎరా పాఠశాలలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు గౌతమి ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ప్రసాదం పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ అపర్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూ ఎరాలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గోపన్‌పల్లిలో క్లీనప్‌డ్రైవ్

రాయదుర్గం: గోపన్‌పల్లిలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంగళవారం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచనల మేరకు అధికారులు ఆలయ పరిసరాల్లో ఉదయం నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు పర్యవేక్షించారు.

అన్నదాన కార్యక్రమం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, అధ్యక్షుడు కోతిమీర్ అశోక్, వైస్ చైర్మన్ రమేష్, కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.